

# బి లిస్టు

నల్లని తార్రోడ్డుమీద నడుస్తున్నాయి శక్తి లేని కాళ్లు. ఎర్రని ఆకాశం మీదకు పరిగెడుతున్నాయి అదుపులేని ఊహలు.

అతను తొడుక్కున్నవి నీలి చొక్కా, తెల్ల లాగు. పెట్టుకున్నది నల్ల కళ్లజోడు.

ఈడు పాతికపైన. అయినా అయిదేళ్ల క్రిందటి నడకలా, నడుస్తున్న గజంలా, అడవిలోని మదగజంలా, పదవిలోని రాజకీయవేత్తలా, మొదటి రీల్లో తెలుగు సినీమా హీరోలా నడుస్తున్నాడు. నడుస్తూనేమలుపు తిరిగాడు.

ఏడుపు నటిస్తున్న ముష్టివాడు, వయ్యారం ఒలికిస్తున్న ముద్దరాలు. ముష్టివాడి పక్కనుంచి కసిగా లేస్తున్న కంపు, ముద్దరాలి సిగలో నుంచి మత్తుగా లేస్తున్న మల్లెల ఘుమాయింపు. ఒకవంక చల్లని చెట్టునీడ, మరొకవంక నడ్డి బద్దలుకొట్టే ఎండ— ఇవేవీ అతన్ని చెదరగొట్టలేదు. ఎక్కడికో చూస్తూ అలానే నడుస్తున్నాడు.

**జాతి, మతం, కులం — ఇలాంటివి కూడు కూడా పెట్టలేవు అయితేనేమి? మనిషి అధికంగా పట్టుకు పాకులాడేవి అవే వాటికి మనిషి ఇచ్చే విలువ ఇంతింతనరానిది ఇవి మానవత్వంలేని వాడికి ఉపకరించవు ఉన్నవాడిని ఏ విధంగానూ అడ్డనూలేవు. తెలుసుకొనడం ఎలా?**

దారి తరుగుతున్నది. నీలిషర్టు ముందుకు జరుగుతున్నది. చివరకు ఎండ తాగుతున్న అరిటిమొక్కల చిగుళ్ళు, ఆవెనక దాక్కోలేని రాతిగోడల పగుళ్ళు నల్లద్దాలను దూసుకుని అతని కంట్లోపడ్డాయనడానికి నిదర్శనంగా పెదవులు వణికాయి, కాళ్ళు చల్లబడ్డాయి. ఒళ్ళు చెమటపోసుకుని వాసన వదిలేసింది.

కళ్ళజోడు తీసేశాడు. ఎర్రదుమ్ము గుప్పున రేగి పగవాడిలా కంట్లో పడింది. కళ్ళు నీళ్ళు తిప్పుకుంటూ గిరగిరలాడాయి.

అప్పటికతను తుప్పు పట్టిన ఇనపగేటు దగ్గరకు చేరుకున్నాడు. ఒక్క క్షణం ఆగి అరుగుమీద అడుగేసేసరికి, అమాయకంగా ఊగుతున్న అరటిమొక్కలు స్వాగతం పలికినట్లూ, రాతిగోడలు చేతులు తొడుక్కుని కౌగలించుకోబోయినట్లూ అనిపించింది. మెట్లు దాటి, వసారామీద పడి అడుగులేశాడు. కుడి ఎడమల— అరిటిమొక్కలు, రాతిగోడలు. పదిఅడుగులేసి ఆగాడు ఎదట.

గోడకు బిగించిన నల్లటి బోర్డు. బోర్డు నడుమ కాగితాలు. వాటిపైన పేరుకొన్న దుమ్ము.

నీలి చొక్కాలో మునిగిన చెయ్యి దుమ్ము దులిపింది. అరసెకండులో సగంకాలం—కాలం అక్కడే నిల్చుండిపోయి, తెల్లలాగులో వణుకుతున్న కాళ్ళను చూసి నవ్వేసుకుంది. అది చప్పుడుకాని నవ్వు. చచ్చినవాడి నవ్వు.

నల్లకళ్ళజోడు లేని కళ్ళు కాగితాల మీదకు పరుగెత్తాయి. మీదనుంచి కిందకు, కింద నుంచి మీదకు పది— వంద— వందన్నరసార్లు పరిగెడుతూ చదివాయి. "ఎ. వి. రాజారావు, సిహెచ్. విశ్వనాథం, పి. బలరాం......" అలసిపోయాయి, తేలిపోయాయి. చివరకు చీకట్లో మునిగిపోతూ, రెప్పలను కిందకు దించేసుకున్నాయి.

మూసుకున్నకళ్ళు, ములిగిపోతున్న కళ్ళు తనపేరు లేదని మూలుక్కున్నాయి. నీలి చొక్కా తూలుతూ జరిగి, గజం దూరంలో ఉన్న అరుగుమీద కూలబడింది.

నీలిచొక్కా, తెల్లలాగు, నల్లకళ్ళజోడు సొంతదారుడూ, అనుభవిస్తున్నవాడూ వెంకట్రావు. ఆర్జించినవాడు వాళ్ళనాన్న మంగపతి.

మంగపతికి ఒక్కగా నొక్క కొడుకు వెంకట్రావు. వెంకట్రావుకు ఒకే ఒక్క ఆశ— ఉద్యోగం దొరకడం. తర్వాతనే భోజనం, నిద్ర, ప్రేమ వగైరా.

**వెంకట్రావు కళ్ళు ఉద్యోగం మీద. మంగపతి కళ్ళు అది తెచ్చే డబ్బుమీద. లోకం కళ్ళు 'ఈ వెధవకెక్కడుద్యోగం దొరికిపోతుందో!' అన్న భయంమీద.**

**"లోకం నాకు ఉద్యోగం దొరకటం కూడా లేకపోతూంది"- "అతికి పుండేళ్ళున కొడుకు** తెచ్చేడబ్బు లెక్క పెట్టుకోలేను కాబోలు!" ఈ మాటలనే అయిదారు ఎండాకాలాలనుంచి అనుకుంటూ వస్తున్నారా తండ్రీ కొడుకులు.

ఆ మాటే బద్దలయిన అరుగుమీద కూర్చుని అనుకున్నాడు వెంకట్రావు. అయితే బిగ్గరగా, కసిగా అన్నాడు ఆరోజున, అంతే తేడా.

'చివరకు చచ్చు మాస్టరీ ట్రెయినింగుకు కూడా సీటు దొరికిందికాదు. దురదృష్టవంతుల జాబితాలో మొదటివాడు తను. విధి నాలుగు పక్కల నుంచి తన అదృష్టాన్ని నొక్కిపారేస్తున్నది'. తన్నుతానే నిందించుకున్నాడు వెంకట్రావు.

అరిటిమొక్కలు పీకెయ్యాలని, స్కూలుకు నిప్పంటించి అరవాలని, బిగ్గరగా ఏడవాలని అనిపించింది. కానీ, ఏడుపు కూడా వచ్చింది కాదు. అంతలోనే అడుగుల చప్పుడు వినిపించింది. తెల్లటి ఆకారం. కళ్ళలో వెలుగుతున్న తెలివితేటలు.

హెడ్మాస్టర్ని చూసి, చప్పున అరుగుదిగి నీరసంగా నమస్కరించాడు వెంకట్రావు.

నమస్కారం చేస్తున్న వెంకట్రావుకి హెడ్మాస్టరు మీద విరుచుకుపడి తన్నాలనిపించింది.

"నీపేరు వెంకట్రావు కదూ? సెలక్షను నాడు చూశాను. 'బి' లిస్టులో ఉన్నావు. చూసుకున్నావా?" నమస్కారం అందుకుని అన్నాడు హెడ్మాస్టరు.

తరువాత ఆయన 'ఎ' లిస్ట్ పేజీలు గబగబా తిరగేసి, 'బి' లిస్ట్లో వెంకట్రావు పేరు అతనికి చూపించాడు.

'అబ్బ! ఎంత అదృష్టం! బి లిస్ట్లో మొదటిపేరు తనది!' వెంకట్రావుపిచ్చిగా ఊగిపోయాడు. గెంతాలనిపించింది. పాడాలనిపించింది. హెడ్మాస్టర్ని భుజాలకెత్తుకుని ఊరంతా పరిగెత్తాలనిపించింది.

వెంకట్రావులో లేస్తున్న చైతన్యాన్ని గమనిస్తూనే — "చూడు, వెంకట్రావ్! 'ఎ' లిస్టులో ఒకేఒక వ్యక్తి ఇంకా చేరవలసివుంది. ప్రస్తుతం మూడయిందిగా? ఇంకా రెండు గంటలు. అంతే. చేరకపోతే 'బి' లిస్ట్లో మొదటివాడివి నువ్వేగా? నీకే వస్తుంది సీటు. ఘాస్తను. నీ అదృష్టం ఎలా ఉందోమరి? ఏమైనా అయిదు దాటాక ఓసారి కలుసుకో" అంటూ ఆప్యాయంగా భుజంతట్టి వెళ్ళిపోయారాయన.

ఆయన అలా వెళ్ళగానే వెంకట్రావు ఒక్క అదటున 'ఎ' లిస్ట్ తిరగేసి, హెడ్మాస్టరు ఇంకా చేరాలని చూపించిన నంబరు గుర్తుపట్టి చదువుకున్నాడు—"ఎ. వి. నాగమ్మ". 'ఎవరీ నాగమ్మ? ఎక్కడిది?' వెంకట్రావు తలలో ప్రశ్నలు నిలువెత్తున లేచాయి. 'ఈ నాగమ్మ ఇంకా రెండు గంటల్లో చేరకపోతే, ఆ సీటు తనది, ఖాయంగా తనది. అది రూలు. హెడ్మాస్టారు కూడా అవాటే అన్నారు. రెండు గంటలు. అబ్బ!! రెండు... గం... ట...లు! నూటఇరవై నిమిషాలు. ఏడువేల రెండు వందల సెకండ్లు— బోలెడు ఘడియలు, విఘడియలు. ఎంత దీర్ఘమైన కాలం! ఈ లోపున ఆ నాగమ్మ చేరకుండా ఉంటుందా!'

గుండె పీచుమంది.

'ఎందుకు చేరదు? చేదా? ఎందరి కాళ్ళు పట్టుకుని, ఎందరిముందు కళ్ళనీళ్ళు ఒత్తుకుని సంపాదించిందో ఈ సీటు? ఎందుకు వదులుతుంది? నిక్షేపంగా హంసలా నడుచుకుంటూ వచ్చి చేరుతుంది. ఆడవాళకు వారం, వర్జ్యం, శకునం గికునం — వీటిమీద పట్టు జాస్తి. ఆ గొడవల్లో కాస్త ఆలస్యమై ఉండాలి. అంతే అయి ఉంటుంది.' బెదురుగా రోడ్డువైపు చూశాడు. రోడ్డువెంట వస్తున్న ప్రతి ఆడదీ నాగమ్మలానే తోచింది. తన పిచ్చిఊహకు తానే నవ్వుకున్నాడు.

పట్టుతప్పి పరిగెడుతున్న ఆలోచనలను గదమాయించి, నిలకడగా ఆలోచించేసరికి ఇంకా ఆమె చేరకపోవడం ఆలోచించదగ్గ విషయమే ననిపించింది. 'చేరేదైతే ఈ పాటికే చేరి వుండాలి. ఇంత ఆలస్యం చేస్తుందా? ఏదో చూద్దాం అని అప్లికేషను పడేసి, సెలక్షనుకు వచ్చి ఉండాలి. తీరా సెలక్టయిన తర్వాత, వెధవ టీచరు పనేమిటని మానేసి ఉండాలి. పెళ్ళయి ఉంటే, మొగుడు ఇష్టపడకపోవడం; కాకుండా ఉంటే, కళ్యాణం కలిసి వచ్చి, ఇంకెందుకీ గొడవ అని జారెయ్యడం; ఇవేవీ కాకుండా ఉంటే మరో మంచి ఉద్యోగం దొరకడం— ఇలా ఎన్నిలేవు, ఆమె చేరకుండా ఉండటానికి కారణాలు?

## ఆతుండి రాజేశ్వరరావు

# బి లిస్ట్

'చివరకు— వస్తూ వస్తూ ఉంటే బస్సు బోల్తాకొట్టి పరలోకానికి వెంచెయ్యడానికి మాత్రం అవకాశం లేదు కనుకనా? దైవందయ తలచి అలా జరిగినా బాగుణ్ను!'

పెద్దశబ్దం, బోల్తాపడిన బస్సు, ఏడుస్తున్న జనం, రక్తపు మడుగులో కొట్టుకుంటున్న నాగమ్మ— ఈ ఊహల బొమ్మలు వెంకట్రావు కళ్లముందు ఓసారి అస్పష్టంగా కదిలాయి.

ఏమైనా కాలానికి, అదృష్టానికి ముడి పడింది. 'అదృష్టమే వరిస్తుందో, దురదృష్టమే తన్ను పరిహసిస్తుందో చూడాలి' అని అనుకుంటూ ఉండగానే కాలం విలువ తొలిసారిగా స్ఫురణకు వచ్చింది. వెనువెంటనే కాలం రూపంతొడుక్కుని తనచుట్టూ కరాళ నృత్యం చేస్తున్నట్లనిపించింది. ''విలువైనదే కాదు, భయంకరమైనది కూడానూ.'' గొణుక్కున్నాడు. ఆలోచించాడు.

'మానవ జీవితంలోని ప్రతి చెడుకూ, మంచికీ; కష్టానికీ, సుఖానికీ కాలమే కారణం. కాలం జీవితాలను శాసిస్తున్నది. శపిస్తున్నది. సంపన్నం చేస్తున్నది. చివరకు నశింప చేస్తున్నది. మానవుడు కాలానికి బానిస. కాలపు గాలానికి తగులుకుని కొట్టుకుంటున్న అభాగ్యుడు. కాలానికి దయ, హృదయం— రెండూ లేవు. ఉన్న దొక్కటే— ధర్మం.' ఇలా అతని ఆలోచనలు పరిగెత్తాయి. చాలాసేపు స్తబ్దంగా కూర్చుండిపోయాడు. చివరకు, లేచి రోడ్డున పడ్డాడు.

ఏంచెయ్యడానికీ తోచలేదు. ఏం చెయ్యకుండా ఉండటానికీతోచలేదు. అప్రయత్నంగానే పదిబారల దూరంలో ఉన్న చింతచెట్టు కిందకు చేరి, దయ్యపు వేళ్లలాంటి దాని వేళ్లమీద కూలబడ్డాడు. అక్కడే బాగున్నట్లనిపించింది.

పన్నెండుగంటల సమయంలో ఊళ్లోనుంచి అదొక్కటేదారి. ఎవరు వచ్చినా కంటపడక తప్పదు. అందుకే అక్కడ బైఠాయించి, నాగమ్మ వచ్చేదీ లేనిదీ తెల్సుకోవాలను కున్నాడు.

కూర్చుని నాలుగు నిమిషాలు అయిందో లేదో ఆలోచనలు మెల్లగా కదలడం ఆరంభించాయి.

'ఏమైనా, ఆమె చేరడానికి వీల్లేదు. వీల్లేదని అనుకుంటే ఏమైనట్టు? చేతనైతే ఆమె చేరకుండాచేయాలి, అదీ ప్రజ్ఞ. ఎలా?'

వికృతశక్తులు వెంకట్రావు హృదయాన్ని అదిమిపెట్టి, ఆలోచనలు అందించసాగాయి.

'ఎలానో మేం చెబుతాము. చెప్పినట్టు చెయ్యి. చాలు. ఇప్పటికే లోకం బతకలేని వెధవ అని నవ్వుతున్నది. రేపటినుంచి ఉమ్ముతుందికూడా. తుడిచేసుకోగలవా? అందుకే మా మాట విను. ఆమె వస్తూ ఉంటుంది. నువ్వు వెనకా ముందూ చూడకు. అదిగో, పచ్చెడు రాయి. చప్పున అది తీసుకుని, నీ తల చింత చెట్టుచాటున ఉంచి, ఆమెతల బద్దలయ్యేలా కొట్టు. బస్. పని అయిపోతుంది. చల్లగా అక్కడనుంచి జారుకో.'

'అమ్మయ్యో! హత్య! ఉరిశిక్ష!' గ గజ వణికిపోయాడు వెంకట్రావు.

'అయితే నీఖర్మం! చంపలేనివాడివి, చంపి తప్పించుకోలేనివాడివి— నువ్వు బతికేదేమిటి? చావు!' ఈసడించాయి వికృతశక్తులు.

క్షణాలు యుగాలుగా నడుస్తున్నాయి. వెంకట్రావు గుండెలు అగ్ని గుండాల్లా మండుతున్నాయి. అంతలో, దూరాన తెల్లచీర రెపరెపలు!

వెంకట్రావు ఒంట్లోనుంచి ఆవిర్లు బయలుదేరాయి. ముఖం చెమటతో ముద్ద అయింది.

అదిగో! వచ్చేస్తూంది నాగమ్మ. తెల్లచీర, చేతిలో సంచీ. సందేహంలేదు —నాగమ్మే. ఆ ఆకారం ముందుకు వస్తున్న కొద్దీ, వెంకట్రావు గుండెలు బరువెక్కసాగాయి.

వికృతశక్తులు 'శే. మేము చెప్పినట్లు చెయ్యి' అంటూ వెయ్యి గొంతుకలతో, అతనిలోనుంచి అరవసాగాయి. వాటఫలితంగా వెంకట్రావు ముఖంలో గంభీరత, హృదయంలో కఠినత్వం, కళ్లలో ఎర్రజీరలు ఏర్పడ్డాయి.

నటరాజ

శిల్పచిత్రం—సిహెచ్. సంపత్‌కుమార్ (మద్రాసు 4)





జీవకారుణ్యం

ఫోటో— ఎస్. ఎన్. ఎస్. శాస్త్రి (బొంబాయి-58)

చప్పున రాయి తీసుకుని, చెట్టుచాటున నిలుచున్నాడు.

కొమ్మకు తల్లకిందుగా వేలాడుతున్న ఋషి పక్షి రెక్కలు కొట్టుకుని ఎగిరింది. చివరన నిలుచున్న కాకి దీనంగా అరిచింది.

ఆమె దగ్గరకు వచ్చేస్తూంది. వెంకట్రావు గుండె చేత్తోపట్టుకొని, గురిచూశాడు. బలంగా రాయి విసరబోయేసరికి, చేతులు తోటకూర కాడల్లా విలవిల్లాడాయి. ఎముకలు కరిగి పోతున్నట్లనిపించింది. చేతిలోని రాయి అప్రయత్నంగా జారిపోయింది.

నిలువుగుడ్లేసి —చెట్టుదాటిపోతూన్న ఆమె వైపు దీనంగా చూస్తూ నిలబడిపోయాడు వెంకట్రావు.

మరుక్షణంలో— ఏం తట్టిందోమరి— ఒక్క అదటున ఆమె ముందుకు ఉరికి, రెండు చేతులూ చాపి, అడ్డంపడ్డాడు.

“నీపేరు నాగమ్మకదూ? నాకు తెలుసు. ఒక్క అడుగు కూడా ముందుకు కదలనివ్వను. మెళో తాళి లేనట్టుంది. అంటే ఇంకా పెళ్ళి కాలేదన్నమాట? పెళ్ళికాలేదని ట్రెయినింగుకు వస్తావా? కాకేం చేస్తుంది? నిక్షేపంలా అవుతుంది. నామాట విను. నీకేం? అందాల బొమ్మవి! నీ ఉద్దేశం నాకర్థమైంది— ట్రెయినింగై ఆ తరువాత పంతులమ్మవై, వచ్చే జీతమంతా కూడబెట్టి, ఓ మగవాడి దోసిట్లో పోసి, వాడిచేత మూడు ముళ్ళూ వేయించుకుందామనుకుంటున్నావు. అంతే కదూ? అందమున్నా, చదువుకున్నా, లెక్కలోకి తీసుకోకుండా,కట్నాలకోసం లోకంకలవరిస్తుంటే ఏంచేస్తావు మరి! ఓ పని చెయ్యి. నీ సీటు నాకు వదిలేయి. నిన్ను నేను పెళ్ళిచేసుకుంటాను. పువ్వులతో పూజచేసుకుంటాను. ఆకాశంలో ఊరేగిస్తాను. పైసా కట్నం కూడా నువ్వు ఇవ్వక్కర్లేదు. నీకు పెళ్ళికావాలి, నాకు ఉద్యోగం కావాలి. ఈ పద్ధతి ఉభయతారకం. ఏమంటావు?”

ఆమె చారెడేసికళ్ళు, ఎర్రని పెదవులు అమాయకంగా, అయోమయంగా కదిలాయి.

“నేను నాగమ్మనుకాను. మీరు ఏమో అనుకుంటున్నారల్లే ఉంది” అంటూ అడుగు వేసింది.

ఆమాట నమ్మని వెంకట్రావు ఆమె చేతులు పట్టుకున్నాడు.

“ఛీ పోడు! ఏమిటిది, నడిరోడ్డుమీద? పిచ్చా?” విదిలించి, ఈసడిస్తూ ముందుకు కదిలింది.

ఇక చేసేదిలేక వెంకట్రావు, కదిలిపోతున్న ఆమెవైపు గుడ్లప్పగించి చూస్తూ, గుటకలు వేస్తూ నిలుచుండిపోయాడు.

ఆమె ట్రెయినింగు స్కూలుదాటి ఇంకా ముందుకు పోతూంది.

‘అరెరె! నిజమే, ఆమె నాగమ్మకాదు. నాగమ్మ అయితే స్కూల్లోదూరదా?’ నాగమ్మ అనుకుని ఆమెముందు నానాహంగామా చేసినందుకు వెంకట్రావు తన అవివేకానికి తానే నవ్వుకున్నాడు.

అయిదు గంటలయ్యేవరకూ తనలోతాను సతమతవుతూ, తులలేని భయాందోళనలతో కాలం గడిపేశాడు.

వాచీ చూసుకున్నాడు. అయిదు దాటుతున్నది. నాగమ్మరాలేదు. ‘ఇక రూలు ప్రకారం ఆ సీటు తనది. దేవుడు కూడా మార్చలేడు.’

హాయిగా గాలిపీలుస్తూ, సంతోషంగా అంగలేస్తూ, సరాసరిని హెడ్మాస్టారిగదిలోకి జొరబడి, “నాగమ్మరాలేదు. టైమయిపోయింది. ఇక నన్ను చేర్చుకోండి, సార్” అన్నాడు వినయంగా.

హెడ్మాస్టరుగారు కాగితాలు వ్రాసుకుంటూ వాచీవైపు దృష్టి సారించి, “ఇంకా పది నిమిషాలుందోయ్, అయిదుకి. అదీ గడవనీ” అన్నారు ధీమాగా.

వెంకట్రావుకు పట్టరానంత కోపం వచ్చేసింది.‘మీ టైము తప్పు,సార్! కావాలంటే నాటైము చూసుకోండి’ అనాలనుకున్నాడు. కానీ అనలేకపోయాడు.

అంతలోనే దుబ్బులాంటి కుర్రాడు ఒకతడు ప్రవేశిస్తూ హెడ్మాస్టారికి నమస్కరించాడు.

“ఏమోయ్, నాగమ్మా, ఇంతలేటు చేశావు?” అంటూ హెడ్మాస్టారు, వెంకట్రావువైపు

అదోలా చూశారు. ఆచూపులో 'నువ్వు ఎంత దురదృష్టవంతుడివి!' అన్నభావం ఇమిడి ఉంది.

ఇక ఒక్క క్షణం కూడా అక్కడ ఉండలేక తూలుతూ, బయటపడ్డాడు వెంకట్రావు. "మొగాడా! ఆడదనుకున్నాను. వెధవ పేరూ నీదున్నూ!" గొణుక్కున్నాడు.

వెంకట్రావుకు ప్రపంచమంతా అదోలా కనిపించింది. తన్ను చూసి నవ్వుతున్నట్లని పించింది. ఎలానో అతికష్టంమీద చింత చెట్టుదాకా నడిచి అక్కడ కూలబడ్డాడు.

కళ్ళు తేలిపోతున్నాయి. నరాలు బిగుసుకు పోతున్నాయి. వాటికితోడు చెవుల్లో అనంత వైన హోరు.

ఇక బ్రతికి లాభంలేదు, చావడం మంచిది— అనిపించింది వెంకట్రావుకు. చావడానికి ఎక్కడైతేనేమని, కాస్త చీకటిపడేవరకూ

## బి లిస్ట్

ఆగి ఆ చింతచెట్టు కొమ్మకే ఉరేసుకుని చావాలనుకున్నాడు. ఒక చిన్న కాగితం ముక్క తీసి, "ఉద్యోగం దొరకవందున ఆత్మహత్య తప్పని సరి అయింది. దీనికి నా బాధ్యత లేదు" అని వ్రాసి, మడిచి జేబులో కుక్కు కున్నాడు. చావడానికి ముందు చెయ్యవలసిన పని పూర్తయింది. ఇక చీకటి పడడమే తరువాయి. మిగిలిన పని కూడా పూర్తవు తుంది. చీకటికోసమే నిరీక్షిస్తూ కూర్చు న్నాడు వెంకట్రావు.

ఆ నిరీక్షణలోనుంచి— 'తను చేస్తున్న పని మంచిదేనా?' అనే సందేహం వచ్చి పడింది. తీక్ష్ణంగా ఆలోచించాడు. 'పుట్టిన ప్రతి మనిషీ ఎప్పుడో ఒకప్పుడు చావడం తప్పదు. ఆపనే తాను చేస్తున్నాడు.ఎటొచ్చీ కాస్తముందుగా చేస్తున్నాడు, బతికేదారి లేదు కనుక. అంతే. జీవచ్ఛవంలా జీవించడం కన్నా మరణించడం మేలు!' ఏవిధంగా చూసినా తను చేస్తున్న పని ఒప్పే అని నిర్ధారణ చేసుకున్నాడు.

మెల్లగా సంజచీకట్లు లోకాన్ని ఆక్రమించు కుని కాటుకలా నల్లబడ్డాయి. అరణ్యం గుండెల్లో పొదువుకున్న నిశ్శబ్దం అంతటా ఆవరించుకుంది. 'ఇక ఈ క్షుభిత జీవితాన్ని ముగించుకోవాలి' అనుకుంటూ లేవ బోయాడు వెంకట్రావు.

అంతలో— చల్లని హస్తస్పర్శ! చకితుడై తలపక్కకు తిప్పాడు. ఒక కంట్లోభయం, రెండవ కంట్లో సంభ్రమం తోడుగా. అమాయకుని సంతోషంలా నిడుపైన కనులు, అందిన ఆశలా అందమైన ముఖం, తెల్లని చీర, చల్లని నవ్వు.

నాగమ్మ! కాదు, నాగమ్మ అని తను భ్రమిం చిన ఆమె.

ఆమె జాలిగా, లాలనగా అతని తలను నవరిస్తూనే ఉంది. ఆమె ముఖంలో కదులు తూన్న మానవత్వాన్ని, ఆ గుడ్డి వెలుగులో పిచ్చిగా అవలోకిస్తూ, ఒక్కసారి బావురు మంటూ ఆమె ఒడిలోకి ఒరిగిపోయాడు వెంకట్రావు.

కట్టలు తెంచుకుంటున్న అశ్రు ప్రవాహం ఆమె ఒడిలో. ఉవ్వెత్తుగాలేస్తున్న కారుణ్య తరంగాలు ఆమె తరుణ హృదయంలో. ఆమె బలంగా, నమ్మకంగా, బతకలేని వెంకట్రావును, చంపాలనుకున్న వెంకట్రావును, చావాలనుకున్న వెంకట్రావును గుండెలకు అదుముకుంది.

కాలం ఆక్షణాల పవిత్రతకు గర్వించింది.

* * * *

ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆమె ఇంట్లో కూర్చుని రకరకాల మిఠాయిలు చేస్తుంది. మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకు ఆ మిఠాయిని కొట్టుమీద ఉంచి అమ్ముతాడు వెంకట్రావు.

అది వారి భౌతిక జీవితానికి ఆధారం. కాని వారి ఆంతరంగిక జీవితాలకు, ఒకరి మనస్సే మరొకరికి ఆధారం.

వారి జీవితాలు మహోజ్జ్వలంగా సాగి పోతున్నాయి. కానీ లోకంమాత్రం "నిక్షేపంలా ఉద్యోగమో, సద్యోగమో చేసుకుంటూ బతక వలసిన వెంకట్రావు, ఊరూ పేరూ లేని ఆ ఆడదాని వల్లోపడి చెడిపోయాడు" అని నిరసిస్తూనే ఉంది. ఎప్పటికైనా— ఉద్యోగం లేక, బతకలేక, చావుకు సిద్ధపడిన వెంకట్రా వులో బతుకుపైన విశ్వాసాన్ని, తీపిని ఎంతగా ఆమె కలిగించిందో ఈ లోకం తెలుసుకో గలుగుతుందా? ఏమో, మరి! ★

తల్లి బిడ్డ

చిత్రం — వి. ఎస్. స్వామి (మురపాక)

